# యద్భవిష్యులు

"నేను హిందువు నెట్లయిత? నేను నాస్తికుడిని."

"అందుకే హిందువన్నాను. హిందూ మతంలో నాస్తికుడూ ఉండొచ్చు, ఆస్తికుడూ ఉండొచ్చు. వేరేమతంలో పుట్టినవాడు తను నాస్తికుడనంటే చంపేస్తారు. నువ్వు హిందూమతంలో ఉండటం వల్లే నువ్వీ ప్రేలాపనలన్నీ పేలుతున్నావు."

"ఏందో నీ మాటలకు అర్థమే ఉండదు. పిచ్చివాగుడు వాగుతా ఉంటావు. నేను దేవుణ్ణే నమ్మనయ్యా బాబూ అంటే నన్ను పట్టుకుని హిందువువంటావు?"

"హిందూమతంలో శైవం, వైష్ణవం, శాక్తేయం లాంటి వెలా వివిధ శాఖలో, చార్వాకం కూడా ఒక శాఖే. చార్వాకమంటే నాస్తికమతం. నాది నాస్తికమతమన్నందుకు చార్వాకుణ్ణి ఉరితీయలేదు, శిలువ వెయ్యలేదు, సజీవ దహనంచెయ్యలేదు. బుద్ధుడిని ఎలా పదో అవతారంగా గ్రహించారో, అలా నాస్తికమతాన్నీ మరో శాఖగా గ్రహించారు. కనుక నువ్వు నాస్తికవాదినని చెప్పుకున్నంత వరకు నిన్ను జనం హిందువుగానే పరిగణిస్తారు" అన్నాను.

"నోర్మూసుకో. ఇది హిందూ ఉగ్రవాదం. చెప్తుంటే తెలియటంలా? నువ్వు.. నువ్వు..."

రంగరాజు నన్ను శపించకముందే వచ్చి ఆదుకున్నాడు సెక్రటరీ వెంకట నారాయణ. అతడు మహా శాంతి కాముకుడు. వస్తూనే, "శాంతి! శాంతి! ఏంటివిటి కొట్లాడు కుంటున్నారు?" అని అడిగాడు.

"నాలాంటి స్వచ్ఛమయిన నాస్తికవాదిని పట్టుకుని హిందువంటున్నాడు! ఇతడికే మయినా బుద్ధుందా?డబ్బులిస్తున్నారుకదా అని ఎవరికిబడితే వాళ్ళకి ఫ్లాట్లు అమ్మితే ఇలాగే ఉంటుంది..."

"అదేం మాటలయ్యా పాత కార్యదర్శిని అలా అనొచ్చా. మన ఫ్లాట్ ఓనర్లలో సీనియర్ ఆయన!" అన్నాడు సెక్రటరీ వెంకట నారాయణ.

"దేశంలోని దౌర్భాగ్యం ఇదే! తన్ను హిందువని చెప్పుకోటం అలావుంచి, భావించుకోటం కూడా నామోషీగా భావించే జనం అధికమయ్యారు ఇండియా దటీజ్ భారత్‌లో. పారశీకులు మన దేశాన్ని హిందూస్తానమని పిల్చినా, మనం మాత్రం భారత్ అని పిల్చుకుంటాం, ఇతర మతస్థుల మనోభావాలు దెబ్బ తింటాయేమోనని..." అన్నాను.

"చూశావా, చూశావా అతని మాటలు...?"

"ప్లీజ్, పార్థసారధిగారు! మనం మత విషయాలు చర్చించుకోటం మంచిది కాదు. అనవసరంగా ఆవేశకావేషాలుపెరిగి మనస్పర్థలకు దారితీయటం వాంఛనీయం కాదు..." అన్నాడు సెక్రటరీ వెంకట నారాయణః

సెక్యులర్ జీవి సెక్రటరీ వెంకట నారాయణ నిత్యం శాంతిమంత్రం పఠిస్తుంటాడు. అతన్ని చూడగానే నాకు మండిపోయింది. భారతదేశం పాకీస్తాన్‌తో సంభాషణలు మొదలెట్టినప్పుడల్లా 'అమన్ కీ ఆశా' అంటూ శాంతిసాధన సులభం అన్న భావనను వ్యాపింప చేయటం ఒక పరిశ్రమగా నిర్వహిస్తున్న జాతికి చెందిన మనిషని పిస్తుంది అతన్ని చూస్తే నాకు.

"ఎందుకయ్యా, మీసెక్యులర్ ప్రభుత్వం పాకీస్తానుతోశాంతి చర్చలు జరిపేది? మీరు శాంతి చర్చలు జరుపుతూనే ఉంటారు, వాళ్ళు ఉగ్రవాదుల్ని సరిహద్దులు దాటించి మన దేశంలో హననకాండ సాగించ పంపుతుంటారు. అయ్యేనా, పొయ్యేనా?" అన్నాను.

"శాంతి! శాంతి! ప్రపంచంలో ఎన్ని వైషమ్యాలు, ఘర్షణలు, విద్వేషాలు ఉండాలో, అవన్నీ మన కాంప్లెక్సులోనే ఉన్నాయి. మనం రాజకీయాలు మాట్లాడుకోటం కూడ మంచిది కాదు" అన్నాడు సెక్రటరీ వెంకట నారాయణ.

"అసలు మనం ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోటం కూడ మంచిది కాదు. సరసులుకాని మనుషులనందర్నీ కాంప్లెక్సులో పోగుచేశావయ్యా, సెక్రటరీ?" అన్నాడు రంగరాజు, విరసంగా.

అలా క్రింద సెల్లార్‌లో మాచర్చ కొనసాగుతుండగానే పైన ఫ్లోర్‌లో రంకెలు మొదలయ్యాయి. అంటే సాయంత్రం ఏడు గంటలు దాటిందన్న మాట! యుద్ధం మొదలయ్యే సూచనలు మొదలవగానే సెక్రటరీ వెంకట నారాయణ "పని ఉందం"టూ స్కూటరు

స్టార్టు చేసి వెళ్ళిపోయాడు.

"నా ఇంటికి ఎవడొస్తే నీకెందుకు? నేనేం నౌకరీ చేస్తే నీకెందుకు, చెయ్యకుంటే నీకెందుకు? నువ్వెడివి నా ఇంటి విషయాలు ఆరాతియ్యటానికి?" అని అరుపులు వినిపించాయి.

కనీసం నెలకోసారి అయినా కనకసుందరరావు ఇలా వీరంగం సాగిస్తూనే ఉంటాడు. తాగి గోల చేస్తున్నాడని అతని గోల హద్దు మీరి పోయి నప్పుడు పోలీసు కంప్లెయింటు ఇద్దామని అంతకుముందు భావించాను కానీ పస్తాయించాను. పోలీసువాళ్ళతో ఓసారి ప్రమేయం పెట్టుకుంటే ఓ పట్టాన వదలరు. అయితే, కాంప్లెక్సు జనం కూడ కనకసుందరరావు వీరంగాలకు మొదట్లో భయపడి పోయినా తరవాత అలవాటు పడిపోయారు. కొత్త కనక, సెక్రటరీ వెంకట నారాయణకు ఇంకా భయం పోలేదు.

ఆ కాంప్లెక్సులో క్రింది ఫ్లోర్‌లో కనకసుందర రావు ఏడెనిమిదేళ్ళనుండి అద్దెకుంటున్నాడు. ఉద్యోగం ఏంచేస్తాడో ఎవరికీ తెలీదు, ఒకోసారి రోజుల తరబడి కూడ ఇంటికి రాడు. ఓసారి నేను అడిగితే అతని పెళ్ళాం గౌరి దుబాయ్ వెళ్ళాడని చెప్పింది. వాళ్ళ ఇంటికి ఎవరెవరో కొత్తవాళ్ళు వచ్చి వెళ్తుంటారు. అడిగితే, గౌరి, "మా బావగారి కూతుర"నో, "మా పెద్దత్తగారి కొడుక"నో చెప్తూ ఉంటుంది. కాదనటానికీ, వివాదపడటానికీ ఆస్కారమే ఉండదు. ఆమె మొగుడు కనకసుందర రావు రోజూ సాయంత్రం వచ్చి, తాగి వెళ్ళిపోతాడు. ఒకోరోజు ఏదో వంక పెట్టుకుని వాచ్‌మన్ మల్లయ్యను కొట్టటమో, కాంప్లెక్సులోని జనాలతో వివాదాలకు దిగటమో చేస్తుంటాడు. కాంప్లెక్సు అన్నాక, అందరూ కల్సి పెట్టుకోవాల్సిన ఖర్చులుంటాయి. బోరు చెడిపోవచ్చు, డ్రయినేజి సమస్యకావచ్చు, ఎలక్ట్రిక్ సప్లై సమస్య కావచ్చు, అందరూ తలా ఇంత అని ఇస్తేనే కానీ పని గడవదు. వీళ్ళు మాత్రం మెయింటెనెన్స్ తప్ప పైస అదనంగా ఇవ్వరు. ఇంటివాళ్ళు ఎక్కడో ఉంటారు. వాళ్ళు కూడ అలాంటివాళ్ళే. తమ ఫ్లాటు ఖాళీఅయితే, మెయింటెనెన్స్ కూడ ఇవ్వరు. "బోరు పంపు చెడిపోయిందయ్యా, కొత్తది కొనాలి, మీ వంతు రెండు వేలు అవుతుంది" అంటే, "మాకు నీళ్ళక్కర్లేదు" అని ఫోను పెట్టేస్తారు. అద్దెకున్న వాళ్ళకు మాత్రం ఎక్కడలేని నీళ్ళ దాహం! ఇంక కనక సుందరరావు విషయాని కొస్తే, అతడు పోట్లాడటానికి తప్ప కాంప్లెక్సు జనంతో మాట్లాడటానికి నోరు తెరవడు. ఓసారి అలాంటి అదనపు ఖర్చుకే డబ్బడిగితే, ఇవ్వలేదు కానీ, మమ్మల్ని కొట్టి నంత పని చేశాడు. ఇంక అతని భార్య అయితే పతివ్రతా శిరోమణి. రోజూ ఏవో పూజలు చేస్తూ ఉంటుంది. కాంప్లెక్సులో ఏ ఒకరిద్దరితో తప్ప ఎవరితోనూ పడదు కనుక ఆ పూజలకు,

వాయినాలకు పిలవదు. "పూలూ, కొబ్బరికాయలు దిష్టితీసి ఎర్రనీళ్ళు అర్థరాత్రి వీధి కూడల్లో పోయిస్తుందంట!" అని అమ్మలక్కలు గుసగుసలాడుకునే వారు. గౌరికి కడుపు నిలవదు, అబార్షన్లు అవుతాయట! కడుపు నిలవటం కోసం పూజలు, పునస్కారాలూ చేస్తున్నానని చెప్తుంటుంది గౌరి. వాళ్ళూ వీళ్ళూ రకరకాలుగా చెవులు కొరుక్కోటమే కానీ, అడిగేదమ్మ ఎవరికీ లేదు. ఆ రోజు రంకెలకు కారణం అదే. వాళ్ళ ఇంటికి ఎవరెవరో వచ్చి పోతుంటారని పక్కింటివాళ్ళు వాచ్‌మన్ మల్లయ్యతో అన్నారట! కనకసుందరరావు ఏతప్పుడు పన్లు చేసి సంపాదిస్తున్నాడో అనికూడ అన్నారట!

"మీ ఇంటికి ఎవతొస్తే మాకెందుకు, ఏ నాకొడుకొస్తే మాకేం పట్టె! రమ్మను, ఏ గాడ్దెకొడుకు చెప్పాడో చెప్పమను, మేమన్నామని!" అని కనకసుందరరావు రంకెలకు దీటుగా జవాబిస్తున్నాడు సన్నాసి నేను పైకి వెళ్ళేటప్పటికి.

అతడేదో వ్యాపారం చేస్తుంటాడు. ఆ చుట్టుపక్కల బంధు బలగం కలిగినవాడు. ఏదయినా పేచీ వస్తే వాళ్ళంతా మూకుమ్మడిగా వచ్చి పడతారు. అందుకే కనకసుందరరావును ఢీకొనే ధైర్యం చేశాడు.

పక్కనే నిలబడి చోద్యం చూస్తున్న వాచ్‌మన్ చెయ్యి పట్టుకులాగి, "చెప్పరా, బాడఖోవ్! వాడి పెళ్ళాం ఆ మాట అందా లేదా?" అడిగాడు కనకసుందరరావు. ఏడు గంటలకే అతడు గొంతువరకు పట్టించి ఉన్నాడు.

"నాకేం తెల్సు, సారూ?" అని ఎదురు ప్రశ్న వేశాడు వాచ్‌మన్ మల్లయ్య.

అంతే, కాలెత్తి వాడినొక తన్ను తన్నాడు కనకసుందరరావు. వాడు కింద పడి 'కుయ్యో'మన్నాడు.

"తెలీదురా, నా కొడక! పోస్తే గ్లాసులు గ్లాసులు గడగడ తాగే గాడిదవు, మరేం తెల్సురా నీకు? చంపుతా నా కొడక! ఆళ్ళు ఆ మాటన్నారని చెప్తివి. ఇప్పుడు నాకేం తెల్సంటావు, బే" అంటూ ఈడ్చి పెట్టి మరో తన్ను తన్నాడు.

వాడు కొట్టినందుకు ఎవరికీ వాచ్‌మన్ మీద సానుభూతి కలగలేదు. రాత్రిళ్ళు వాడు తాగుతూ, వీడికీపోస్తుంటాడు, ఆపైన డబ్బులిచ్చి అడ్డమయిన చాకిరీ చేయించుకుంటుంటాడు. తాగించిన వాడికి, తన్నే హక్కు కూడ ఉంటుందని కాంప్లెక్సు న్యాయ కోవిదులు ఎప్పుడో సెలవిచ్చారు. కాంపెక్సు చిన్నది. ఈ వాచ్‌మన్‌ను తీసి మరొకడిని పెట్టుకోవాలన్నా భరించేంత ఆర్థిక స్తోమత కాంప్లెక్సుకు లేదు. వాచ్‌మన్‌కూ ఆ విషయం తెల్సు. అందుకని అతడూ, సొంతపనులు చేయించుకుని డబ్బులిస్తాడు

కనుక కాంప్లెక్సు సెక్రటరీ మాట వింటూ, అలా పనులు చేయించుకోటం గానీ, డబ్బు లివ్వటం గానీ చెయ్యని ప్రెసిడెంటు మాటలు వినకుండా, రలాయిస్తూంటాడు. మిగతా ఫ్లాటువాసుల విషయంలోనూ వాచ్‌మన్ మల్లయ్య అదే విచక్షణతో పనిచేస్తాడు.

అంతలో, కనకసుందరరావు పెళ్ళాం వచ్చి అతన్ని ఇంట్లోకి లాక్కెళ్ళింది. అలా అని వారిది ఆదర్శదాంపత్యం అని పొరపాటు పడాల్సిన పని లేదు. ఇద్దరూ తాగి, కైపెక్కాక తన్ను కుంటారని కాంప్లెక్సులో జనం అనుకుంటూ ఉంటారు.

ఆ విషయాన్ని గురించే, "ఏరా, నిజమా?" అని నా భార్య ఓ రోజు వాచ్‌మన్‌ని అడిగింది.

ఆమెకు తను పట్టించుకోక పోతే ప్రపంచం ఏమయిపోతుందోనని భయం.

"అయుండొచ్చేమో నండీ! అయినా ఆ సారు రాత్రి ఎనిమిది గంటలకల్లా ఎళ్ళిపోతాడు కదండీ! ఎప్పుడో ఒకసారి మొగుడూ, పెళ్ళాలు కొట్టుకోకుండా జరగదు కదండీ!" అన్నాడు.

"అదేంటి, రాత్రి ఎనిమిది గంటలకు ఎక్కడికెళ్తాడు?" అని ఆశ్చర్యపోతూ అడిగిందామె.

"ఇంటికి రాకపోతే ఆ పెళ్ళాం ఊరుకోదుకదండీ మరి!"

"అది అనలు పెళ్ళామా, ఇది అసలు పెళ్ళామా?"

"తెలవదండీ. ఈయమ్మను లేపుకొచ్చాడంట! పాపం పుణ్యం ఆ దేవుఁడికే తెలవాల."

"ఉంపుడుగత్తె అన్నమాట! అందుకే అంత పతివ్రత వేషాలు! మరి నాలుగడుగులు వేయలేదు. మొన్న మా ఇంటికేదో అడగటానికి మెట్లెక్కి వచ్చి రొప్పుతోంది. నేనున్నాను కదా, నన్నడగొచ్చుగా? ఆయనతో మాట్లాడుతోంది. ఇంటివాళ్ళు ఇంటి పన్ను కట్టమన్నారంట! ఎక్కడ కట్టాలండీ అని అడిగింది. 'మునిపాలిటీ ఆఫీసులో కట్టు, లేకపోతే ఇ-సేవలో కట్టు' అని చెప్పాను. అప్పుడు నాకు తెల్సింది, దాని చదువుకూడ అంతంత మాత్రమేనని. అవునూ, నలభయ్యేళ్ళుంటాయేమో, ఆ వయసుకే ఆ సుతారమేం?"

"పుట్టెడు రోగాలు. నడవలేదు. ఎయిర్‌కండిషన్ లేకుండ చనం ఉండలేదు. నెలకు ఐదువేలు కరెంటు బిల్లు కడ్తాది."

"అంత డబ్బెక్కడిదయ్యా? ఆ కనకసుందరరావు ఏం ఉద్యోగం చేస్తాడేం? కారుకూడ కొన్నారు. మొన్నోసారి కారులో వస్తే చూశాలే!"

"తెలవదండీ. కాంట్రాక్టులు చేస్తాడని ఆయమ్మ చెప్తుండె. మీరింకేమీ నన్నడగకండీ అమ్మా! ఆడు ఇంటే నా పాణం తీస్తాడు."

"ఛ. నాకు చెప్పిన మాటలు ఇంకో చెవికి పోవు. నువ్వేం భయపడక."

నెల రోజుల తర్వాత, సెక్రటరీ వెంకట నారాయణ భార్య నా దగ్గరకు తల్లిని వెంటబెట్టుకుని వచ్చి గోల పెట్టింది.

"బాబాయి గారు! మా ఆయన కా సెక్రటరీ పదవి వద్దు. ఇదివరకటిలా మీరే చేసుకోండి. మమ్మల్నిట్టా బతకనివ్వండి" అని రాగాలు తియ్యటం మొదలెట్టింది.

"ఏమయిందమ్మా, ఇప్పుడు?" అనడిగాను.

"మా ఆయన ప్రాణం తీస్తానన్నాడు ఆ కనకసుందరరావు!"

"ఏందుకూ?"

"పై నీళ్ళ టాంకునుండి ఎవరికీ చెప్పకుండా మేం మా ఇంటికి డైరెక్టు కనెక్షను పెట్టుకున్నామంట! మేముండేది మూడో అంతస్థులో. అందరికీ బాగానే నీళ్ళు వస్తాయి. మాకే రావు. అందుకే పెట్టుకున్నాం. తప్పేమిటి? అందువల్ల క్రింది ఫ్లోర్‌లో ఉన్న వాడికేమిబ్బంది?"

"తప్పే. జనరల్‌బాడీలో అప్రూవ్ కాకుండా ఎట్లా డైరెక్ట్ కనెక్షనిప్పించుకుంటారు? కాంప్లెక్స్ సెక్రటరీ కనుక మీ ఆయనకు ప్రత్యేక హక్కు లుండవు. మూడో అంతస్థులో మరి మూడుఫ్లాటులున్నాయి. వాళ్ళు మాకు నీళ్ళు రావనటంలేదనలేదే?"

తమ మాట కాదన్నందుకు ఆ పిల్ల తల్లికి కోపమొచ్చింది.

"అయితే, మేము అబద్ధం చెబుతున్నామా?" అంది ఆమె కోపంగా.

"మీరు అబద్ధం చెప్పారని నేననలేదు. సెక్రటరీ కాంగానే తనిష్టమొచ్చేట్టు చేసే అధికారాలు ఆయనకొచ్చినయ్యా అని ఇద్దరు, ముగ్గురు మిత్రులు నన్ను అడిగారు."

"ఎవరా మిత్రులు? అందులో ఆ కనకసుందరరావు కూడా ఒకడా? మా అల్లుడిని కొట్టమని ఆ దుర్మార్గుడిని మీరే ప్రేరేపించి నట్లున్నారు. వయసొస్తే సరికాదు, బుద్ధి పెరగాలి! మా అల్లుడిని సెక్రటరీ పనికి రిజైన్ చెయ్యమని చెప్తాను."

"చెప్పండి. నేను పదిహేనేళ్ళు చేశాను. డెబ్బయి యేళ్ళు మీద పడ్డాయి. నా వల్ల కాలేదు. మీరు ఫ్లాటు కొనుక్కొని వచ్చి సంవత్సర మయింది. అందుకే కుర్రవాడని వెంకట నారాయణను సెక్రటరీ చేశాం. కాంప్లెక్సులో రకరకాలమనుషులుంటారు. బెదిరిపోతే ఎట్లా? కనకసుందరరావుని నేనేం సమర్థించటం లేదు, నేనేం అతన్ని కొట్టమని చెప్పలేదు. మీరు రిజైన్ చెయ్యమనగానే వెంకట నారాయణ చెయ్యడు. సెక్రటరీగా అదనపు అధికారాల రుచి మరిగాడతను."

"నెపమెన్నే ఈ కుళ్ళు బుద్ధే పనికిరాదు. ఎవరికి ఎట్లా వాత పెట్టాలో మా అల్లుడికి బాగా తెలుసు" అంది కసిగా వెంకట నారాయణ అత్తగారు, లేచి కూతుర్ని తీసుకుని వెళ్ళి పోతూ.

ఆమెకు నా మీద అంత కోపం ఎందుకో అర్థం కాలేదు. కాంప్లెక్సు నిర్వహణ కష్టమయిన పనే. మీటింగు పెడితే ఒక్కడు హాజరు కాడు. అయితే ఏ లోపం జరిగినా మేనేజ్‌మెంటును దుయ్యబడతారందరూ. ఇంక అద్దెకుండేవాళ్ళ జులుమయితే భరించటమే కష్టం. నెలకు ఐదొందల చొప్పున కాంప్లెకు నిర్వహణకు వసూలు చేస్తారు. మేనేజిమెంటు వారికి తామిచ్చే జీతంగా భావిస్తారు దాన్ని వాళ్ళు.

"మా బాత్ రూంలో నీళ్ళు పోవటం లేదు. బాగు చేయించు.లేకుంటే, నీకు మెయింటెనెన్స్ ఇవ్వం" అంటారు.

"మీ బాత్ రూంలో నీళ్ళు పోకపోతే అది మీ సొంత సమస్య. కామన్ ప్రాబ్లమయితే మేం చేయిస్తాం. మీరే ప్లంబర్ని పిల్చి చేయించుకోండి" అంటే దుమ్మెత్తి పోస్తారు.

అయితే, సెక్రటరీ వెంకట నారాయణకు ఈ బాధల్లేవు. అతడు నిత్యం టూర్లలో ఉంటాడు. కనుక, ప్రెసిడెంటు ఫ్లాటు ఓనర్ల, కిరాయిదార్ల కిరాతకాలు నోరెత్తకుండా భరిస్తుంటాడు. అతని ఓర్పు, ఓపికకు జోహార్లు చెప్పుకోవల్సిందే.

కనకసుందరరావు అరాచకాలకు అడ్డుకట్టపడే సమయమొచ్చింది. కాంప్లెక్సు పెంట్ హవుసును ఓ ముస్లిం కొన్నాడు. అతడి పేరు అమీనుద్దీన్. రెండో ఫ్లోర్ లో ఉండే హఫీజ్ మసీదులో కలసినప్పుడు అతడు మా కాంప్లెక్సులో పెంట్ హవుసు అమ్మకానికి ఉందని చెప్పాట్ట! అమీనుద్దీన్ బేరం కుదుర్చుకుని పెంట్ హవుసు కొన్నాడు. అతడు తెలంగాణ యాసలో తెలుగు కూడ బాగానే మాట్లాడతాడు. అతనికో కారుంది. రెండుమూడు కుక్కలు కూడ ఉన్నాయి. 'రాజు వెడలె రవి తేజము లలరగ' అన్నట్లు అతనిచుట్టూ ఓ పరివారముంటుంది. ఎవరితోనూ గిల్లి కజ్జాలు పెట్టుకోడు. పెద్ద సంసారం. అతన్ని చూశాక కనకసుందరరావు వీరంగాలు తగ్గిపోయాయి. అతడు తనకంటే పెద్ద దాదా అని భావించాడో ఏమో ఇదివరకటిలా కాంప్లెక్సులో గోల, రభస సృష్టించటం మానేశాడు. రోజూ సాయంత్రం వచ్చేవాడు. తన ఫ్లాటులో కూర్చుని పూటుగా తాగి, తొమ్మిది గంటలకల్లా గప్‌చిప్‌గా ఉడాయించసాగాడు. కాంప్లెక్సు జనమంతా ఊపిరి పీల్చుకున్నారు. అమీనుద్దీన్‌కు మనసులోనే కృతజ్ఞతలు సమర్పించుకున్నారు.

అయితే, అతడు వచ్చి రెండు నెలలయినా మెయింటెనెన్స్ ఊసు ఎత్తలేదు. ఇలాంటి విషయాలలో అనవసరంగా తల దూర్చవద్దని అతని అత్తగారు సెక్రటరీ వెంకట

నారాయణకు హుకుం జారీ చేసింది. కనుక కాంప్లెక్సులో తన సుఖానికి కావల్సింది చూసుకోటం తప్ప మరో విషయం పట్టించుకోటం మానేశాడు సెక్రటరీ. అతనసలే శాంతి కాముకుడు. ఘర్షణలను భరించలేడు. తన ఆరోగ్యానికి సరయిన దాన్ని ఎంచుకున్నందుకు అతన్ని తప్పు పట్టాల్సిన పని లేదు.

ఉండబట్టలేక కాంప్లెక్స్ ప్రెసిడెంట్, అమీనుద్దీన్ పెంట్ హవుసు రెండుఫ్లాట్లకు సమానం కనుక వెయ్యిరూపాయల మెయింటెనెన్స్ చెల్లించాలని హాఫీజుతో చెప్పాడు. హాఫీజుకు ఒకరిజోలీ, శొంఠీ అక్కరలేదు. తన పనేమో, తనేమో. "గంగి గోవు!" అంటాడు రంగరాజు అతన్ని గూర్చి.

"అవును మెయింటెనెన్స్ కట్టక పోతే ఎలాగ? పద, అతనికి చెబ్దాం" అన్నాడు హాఫీజ్.

ఇద్దరూ కలసి వెళ్ళి, మెయిటెనెన్స్ విషయం అతనికి చెప్పారు. అతను కాదనలేదు. ఓ రోజు సెక్రటరీని, ప్రెసిడెంట్‌ను, హాఫీజును పైకి తీసుకు వెళ్ళి, "పై నీళ్ల టాంకు వల్ల నా పోర్షనంతా లీకవుతున్నది. మీరు దీనికేం చెప్తారు?దీన్నెవరు బాగు చేయిస్తారు" అని అడిగాడు.

"ఈ మాత్రం నీళ్ళురకటం ప్రతి ఫ్లాటులో, ముఖ్యంగా వానా కాలంలో ఉన్నదే. అయినా, మీరు చూసే కొనుక్కున్నారు. ఇప్పుడు మమ్మల్ని అడిగితే మేమేం చెప్పగలం" అన్నాడు ప్రెసిడెంట్.

"అరె యార్! తు పహలే మెయింటెనెన్స్ దో. పైసె పూఛెతా యె లీకేజ్ వొ లీకేజ్ బోల్‌నా అచ్ఛా నహీం హై"అన్నాడు హాఫీజ్.

"అరె నన్ను చెప్పనీ. నా కష్టం కూడ నే చెప్పుకునే పనిలేదా? ఓ పని చేస్తాను. కుడి వైపున ఇంకో కొత్త టాంకిని కట్టిస్తాను. ఇది పాతదయిపోయి లీకవుతోంది" అన్నాడు అమీనుద్దీన్.

"మీరు ఉన్న స్ట్రక్చర్‌లో మార్పులు చేయకండి. దానివల్ల బిల్డింగ్‌కే ప్రమాదం" అన్నాడు సెక్రటరీ వెంకట నారాయణ.

"సహీ బాత్ హై. స్ట్రక్చర్ కే ఏక్ సైడ్ పే వజన్ గిర్తా."

"పోనీ, ఈ టాంకును తీసేసి కొత్తది కట్టిస్తాను. అందుకు అదనంగా మిమ్మల్నేం డబ్బడగను. మీరు నన్ను మెయింటెనెన్స్ అడగొద్దు. వారం రోజుల్లో పని మొదలెడతాను" అన్నాడు అమీనుద్దీన్.

నిర్ణయాలు తీసుకోటం, వాటిని వెంటనే అమలు చేయటం వచ్చినప్పటినుండి ప్రారంభించాడు అతను. అప్పటికే అతను ఎవర్నీ ఏమీ అడగకుండా వెయ్యి లిటర్ల సింటెక్స్ టాంకును టెర్రేస్‌పైన ఏర్పాటు చేసుకున్నాడు. కింది నుండి వచ్చే బోరింగ్ నీళ్ళ గొట్టం నుండి తన టాంకుకు కనెక్షన్ ఇప్పించుకున్నాడు. నీళ్ళటాంకు నుండి సెక్రటరీ వెంకట నారాయణ డైరెక్టు కనెక్షన్ తీసుకున్నాడని గోల పెట్టిన కనకసుందరరావు కూడ నోరెత్తలేదు. ఆమాటనే ఇప్పుడు అమీనుద్దీన్ ఎత్తుతాడని సెక్రటరీ వెంకట నారాయణ గప్‌చుప్‌గా ఉండిపోయాడు. సెక్రటరీని కొత్తగా వచ్చినవాడిచేత మాటనిపించటమెందుకని ప్రెసిడెంటు నోరుమూసుకున్నాడు. హఫీజు తననడిగితే కాని ఏ విషయాలూ పట్టించుకోని మనిషి!

ఓసారి సొసైటీ మీటింగ్‌లో, మునిసిపల్ నల్లా నీళ్ళు చాలటంలేదని కిరాయిదారులు ఫిర్యాదు చేస్తే, "ఇంకో కనెక్షన్ ఇప్పించుకుందాం. మనం ఇబ్బంది పడటమెందుకు?" అన్నాడు అమీనుద్దీన్.

"దానికి రెండు లక్షల పైన ఖర్చవుతుంది. మనం భరించలేం" అన్నాడు ప్రెసిడెంట్.

"మనకు మునిసిపాలిటీలో తెలిసిన వాళ్ళున్నారు. రేపీపాటికి కనెక్షను ఇప్పిస్తాను. పైస ఖర్చుకాదు. ఓ పది వేలు మనవి కాదనుకుంటే పనయి పోతుంది" అన్నాడు అమీనుద్దీన్.

"ఇల్లీగల్ కనెక్షనా? వద్దు నాయనా, మమ్మల్నిట్టా బతకనీ" అన్నాను నేను.

"భయ పడితే పనులవుతయ్యా, పంతులూ! అంతగా ఎవడయినా చెకింగ్ కొస్తే అప్పుడు చూసుకుందాం. ఎన్ని దొంగ కనెక్షన్లు లేవు!'

"'ఛోడ్ యార్, ఫుజూల్ కీ బాతెఁ" అన్నాడు హఫీజ్.

మా సభ్యులెవరూ అందుకు అంగీకరించక పోవటం వల్ల ఆ ప్రతిపాదన వీగిపోయింది. అయితే, అతడు తిమ్మిని బమ్మిని చెయ్యగల సమర్థుడన్న అభిప్రాయం మా సభ్యులలో నెలకొని ఉండి పోయింది. రంగరాజయితే అతని భక్తుడే అయిపోయాడు. కనకసుందరరావును అదుపులో పెట్ట గలిగాడనీ, తన అధికారం విషయంలో కల్పించుకోటంలేదనీ సెక్రటరీ వెంకట నారాయణకు కూడా అతని పట్ల గౌరవం కలిగింది.

"అమీనుద్దీన్ పెద్ద మనిషి! అతనికి ఎవరి జోలీకీ పోడు. మంచి సెక్యులరిష్టు కూడ" అన్నాడు నాతో.

"అతని సెక్యులరిజం వాసన నీకెప్పుడొచ్చిందేం?" అని అడిగాను.

"హజ్ యాత్రకు సబ్సిడీ ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జెరూసలెం వెళ్ళటానికి క్రైస్తవులకూ ఇరవైవేల మేరకు సబ్సిడీ ఇస్తోంది. హిందువులకూ మానస గంగోత్రి యాత్రకు సబ్సిడీ ఇస్తే మనం సరైన సెక్యులరిజం పాటించిన వాళ్ళమవుతామనంటే, ఆ మాట నిజమే నన్నాడు. లౌకికవాది కాని వాడు నా మాటను కొట్టి పారేసేవాడు."

"అలా కాదు నువ్వు అడగవల్సింది. మనది నిజమయిన సెక్యులర్ రాజ్యం కనుక ఏ మతంవారి తీర్థయాత్రలకయినా సబ్సిడీలు ఇవ్వకూడదని అన్నట్లయితే, అప్పుడు తెల్సేది అతను నిఖార్సయిన లౌకికవాదో, కాదో."

"అసలు నువ్వేం మాట్లాడతావో నాకు ఛస్తే అర్థంకాదు. హజ్ యాత్రంటే అది మన దేశంలో ఉన్నది కాదు."

అందువల్ల, ఇప్పుడు మెయింటెనెన్స్ విషయంలో లీకేజీ అంటూ, మెయిన్ టాంక్ మార్చాలని అమీనుద్దీన్ పేచీ పెట్టినా కాంప్లెక్స్‌లో ఎవరూ నోరు మెదపలేదు. అయితే, అది జరిగి మరో ఆర్నెల్లయినా అతడు కొత్త టాంక్ కట్టేపని గాని, పాత టాంక్ రిపేరు పనిగాని చేపట్టలేదు. మెయింటెనెన్సూ ఇవ్వలేదు. పైస ఖర్చులేకుండా, బోరు నీళ్ళ భోగం అనుభవించసాగాడు. నెలలు గడుస్తున్నాయి, కానీ, 'అదేమిటి, డబ్బివ్వకుండా ఎలా కాంప్లెక్సు నీళ్ళు వాడు కుంటావు?' అని అడిగే దమ్ముఎవరికీలేక పోయింది. లీకేజీ విషయం అమీనుద్దీన్ కూడ సుఖంగా మర్చిపోయాడు. వానాకాలంలో ఏ కొంపలో నయినా ఉండే చెమ్మ ఉరుకుడే అది.

అయితే, కొద్ది కాలంలోనే అమీనుద్దీన్ విషయమూ కాంప్లెకులోని జనానికి తెలియ సాగింది. అతను చెప్పుకున్నంత సిరి సంపదలేం అతనికి లేవు. చెప్పుకున్నంత గొప్పగా ఏ పనులూ చెయ్యలేదు. ఫాక్టరీ ఏదో ఉందంటాడు కానీ అదేం బాగా నడుస్తున్నట్టు లేదు.

ఓ రోజు "వెయ్యి రూపాయలు అప్పుకావాలండీ" అనడిగాడు నసుగుతూ వాచ్‌మన్ మల్లయ్య నన్ను.

"ఎందుకూ?" అని అడిగాను నేనతన్ని.

"ముస్లిం సారు గాసు సిలిండరు ఇప్పిస్తానన్నాడు"

"నీకు సిలిండరు లేక పోతే గడవదా? అప్పు చేసి పప్పుకూడెందుకు?"

"వంటకిబ్బందిగా ఉందయ్యా!"

అతడి పెళ్ళాం కొరకరాని కొయ్య. ఆమెక్కడో అచ్చెంపేటలో ఉంటుంది. మొగుడి దగ్గరకు రాదు. పాపం కష్టపడుతున్నాడులే అని వెయ్యి రూపాయలు అతనికి అప్పిచ్చాను. ఆ వెయ్యితో తన దగ్గరున్న రెండువేలు కలిపి మొత్తం మూడు వేలు అమీనుద్దీన్ కిచ్చాడు. ఇచ్చి నెలరోజులయింది కానీ డబ్బూతిరిగివ్వ లేదు, సిలిండెరూ తెచ్చి ఇవ్వలేదు అమీనుద్దీన్. అతన్ని గట్టిగా అడగ లేకా, డబ్బు పోయిందని సమాధాన పడలేకా తల్లడిల్లి పోయాడు మల్లయ్య. అతని జీతానికి మూడువేలు చాల ఎక్కువే.

"ఎవరయ్యా, నిన్నెవరో అతనితో గొడవ పడ్తున్నారు?" అని అడిగింది మా ఆవిడ మల్లయ్యను.

"ఇల్లు అమ్మినోళ్ళు. పాతిక లక్షలకు మాట్లాడుకుని యాభైవేలు బజానా ఇచ్చి ఇంట్లో దిగాడు. మిగతా డబ్బెప్పువిస్తావని అడగటానికి వచ్చారు. ఆ మధ్య బాంకివోళ్ళు కూడ వచ్చారు. ముప్ఫయి లక్షలు అళ్ళ తాన అప్పుచేసిండంట! పైస ఇన్‌స్టాల్‌మెంటు జమ చెయ్యటంలేదంట! బాంకోళ్ళకు తను ఇంట్లో లేనని చెప్పమన్నాడు ముస్లిం సారు."

"పాపం! డబ్బు లేదు గావును. మనకు మెయింటెనెన్స్ కట్టటం లేదని మనం బాధ పడగూడదు" అంది మా ఆవిడ సానుభూతి వ్యక్త పరుస్తూ.

పరిస్థితులిలా ఉండగా ఓ రోజు సాయంత్రం కనకసుందరరావు ఫ్లాటు మీద పోలీసు రైడింగయింది. జనాల మనస్సుల్లో అజ్ఞాతంగా ఉండి, పైకడిగే ధైర్యం చెయ్యలేని నిజం బయట పడింది. గౌరి ఆఫ్లాటులో బ్రోతల్ నడుపుతోంది. కనకసుందరరావు ఆమె మొగుడు కాదు, ఆమెను లేపుకు వచ్చినవాడు. ఆ కొంపకు కొత్త మనుషుల రాకపోకలకు అదే కారణం. వాళ్ళు విటులు, డబ్బుకు శరీరాన్ని అమ్ముకునే కాలేజీ అమ్మాయిలు, గృహిణులు. ముగ్గురు విటులు, నలుగురు అమ్మాయిలు పట్టుబడ్డారు. ఆ సమయంలో కనకసుందరరావు ఇంట్లో లేక పోవటంతో తప్పించుకున్నాడు. నాకిప్పుడు వాడి కలహశీల ప్రవర్తనకు కారణం తెలిసింది. తాము చేసే తప్పుడు పనులను గూర్చి ఎవరూ తమను ప్రశ్నించ కుండా అలా దూకుడుగా ప్రవర్తించేవాడు. ఆ తర్వాత మేం గౌరిని చూడలేదు. పోలీసులు కోర్టులో కేసువేశారట! విషయం తెలుసుకున్న కనకసుందరరావు మళ్ళా మా కాంప్లెక్సు వైపు రాలేదు. వాళ్ళ బంధువులనెవర్నో పంపి ఇల్లు ఖాళీచేసింది గౌరి. మా కాంప్లెక్సు జనం కనకసుందరరావు రభస తప్పిపోవటంతో సంతసించారు. అంతకుముందు అతడు ఎప్పుడు ఎవరి మీద పడి పోడ్తాడో, కొడ్తాడోనని గజగజలాడి పోయారు.

నాలుగు రోజుల తర్వాత సెల్లార్‌లో కలిసిన రంగరాజు, "విన్నావా? ఇది సెక్రటరీ వెంకట నారాయణ పనే నంట! పోలీసులకు అతడే కంప్లెయింటు ఇచ్చాడంట" అన్నాడు దగ్గరగా వచ్చి ఏదో రహస్యం చెబుతున్నట్టు.

"ఎవరు చెప్పారు?" అని అడిగాను.

"ఎవరో చెప్పక్కర్లేదు. రెండూ, రెండూ కలిపితే అర్థమయిపోతుంది. వాడికీ, వీడికీ పడదు. అత్తగారు మా అల్లుడికి ఎవరికి ఎలా వాత పెట్టాలో తెల్సునని బాహాటంగా చెప్తూనే ఉంది. వాడు సెక్రటరీ అయ్యాక కనీసం ఈ ఒక్క మంచి పనయినా చేశాడు. నా కెప్పటినుండో తెల్సు, ఇక్కడ బ్రోతల్ నడుస్తోందని. అయితే, నామాట పట్టించుకునే వాడేడీ ఈ కాంప్లెక్సులో..."

అప్పుడే స్కూటరుమీద నన్ను కలవటానికి దత్తాత్రేయ వచ్చాడు. అతడు నా కున్న మంచి మిత్రులలో ఒకడు. నిర్మొహమాటి. మెరమెచ్చులకోసం మాట్లాడే మనిషి కాదు. తన, పర భేదం లేకుండా నిజాన్ని కుండబద్దలు కొట్టేట్టు చెప్పే మనిషి. ఇతరులకు అప్రియమని తెలిసీ నిజం మరుగు ఫర్చనివాడు. రంగరాజుకూ అతను పరిచయమే.

అతను స్కూటరు పార్క్ చేసి వచ్చాక, "విన్నారా, మా కాంప్లెక్సులో జరిగిన ఘోరం. అంతా పార్థసారథి వల్లే జరిగింది అతను సెక్రటరీగా ఉన్నరోజుల్లోనే తాము మొగుడూ, పెళ్ళామంటూ ఫ్లాటు అద్దెకు తీసుకున్నారు. ఇన్నేళ్ళబట్టీ కాంప్లెక్సు భ్రష్టు పట్టి పోతున్నా ఎవరికీ చీమ కుట్టినట్టు లేదు. మా ఆవిడంది, ఆ భగవంతుడు దాని పీడా వదిలించాడు, వీడి పీడా ఎప్పుడు వదిలిస్తాడో నని" అన్నాడు రంగరాజు.

"ఆ రెండో వాడెవడు?" అడిగాను.

"ఇంకెవడు? ఆ అమీనుద్దీన్ గాడు. ఎంతకాలం మా డబ్బుతో పుక్కటగా వాడికి నీళ్ళివ్వాలి? నేను చెప్తూనే ఉన్నా..."

అలా చెప్తున్నవాడల్లా ఎక్కడనుండో ఊడిపడిన అమీనుద్దీన్‌ను చూసి అవాక్కయి పోయాడు.

"రెండు నెల్లు పైసలు కట్టకపోతే ఇంత లొల్లి చేస్తావుటయ్యా! నీ పైసలు రేపీపాటికి నీ ముఖాన కొడ్తాను. పొద్దున రెండు గంటలు నీళ్ళిచ్చి వెయ్యి రూపాయలిమ్మంటే నేనివ్వను. ట్వంటీ ఫోరవర్సూ ఇవ్వు. అప్పుడాలోచిస్తాను. అప్పటిదాకా నోరు తెర్చావంటే, ఖబడ్దార్! నా సంగతి నీకు తెల్వదు, బర్ఖాస్తయిపోతవు" అని మా వంక ఉరిమి చూసివెళ్ళిపోయాడు అమీనుద్దీన్.

రంగరాజు గజగజలాడి పోయాడు.

"నువ్వు చెప్పొచ్చుగా పార్థసారథీ, మెయింటెనెన్స్ ఇవ్వకుండా నీళ్ళివ్వటం జరగదని. వాడు రౌడీఇజానికి దిగొచ్చు. కానీ చెప్తేగా వాడి రౌడీయిజమెంతో తెలిసేటందుకు. ఆ కనకసుందరరావు ఆగడానికీ భయపడి మీరు నోరెత్తలేదు. వెన్నెముక లేదు. మీరు అకర్మణ్యులు, యద్భవిష్యులు! ఆమె పీడ వదలించినట్లుగా ఆ భగవంతుడు ఇతని పీడనెప్పుడు వదలిస్తాడా అని ఎదురు చూస్తారు!" అన్నాడు దత్తాత్రేయులు. మొదటి మాట మరీ పరుషంగా ధ్వనించిందేమోనని రెండో మాటను సాధుత్వం వెలారిస్తూ ప్రయోగించాడు.

"ఆ మాట నిజమే. మా ప్రెసిడెంటు, సెక్రటరీ, పాత సెక్రటరీ పార్థసారథీ– అందరూ అకర్మణ్యులే. సందేహంలేదు. మరి యద్భవిష్యులంటే ఏమిలో నాకు తెలిసి చావలేదు" అన్నాడు రంగరాజు.

"మీ భార్యకు బాగా తెల్సు, ఆవిడ నడగండి" అని చెప్పి నాతో అతడు మా ఫ్లాటుకు రాబోతుంటే, అడ్డుపడి, "అదేదో మీరే చెప్పి పుణ్యం కట్టుకోండి. ఏమడిగినా దేవుడిని నమ్మానని చెప్పు, అప్పుడు చెప్తానంటుందావిడ. ఈ మాటకోసం నా జీవిత లక్ష్యాన్ని త్యజించటం నావల్ల కాదు" అని ప్రాధేయపడ్డాడు రంగరాజు. అతని భార్య తెలుగు పండిట్.

"నాస్తికత్వమా? సర్లే, యద్భవిష్యులు అంటే తాము ఏ ప్రయత్నమూ చెయ్యకుండా జరిగేది జరగనిమ్మని నిమ్మకు నీరెత్తినట్టు కూర్చునే జనం. వాళ్ళల్లో మీరు చెప్పిన ముగ్గురే కాదు, మీరు కూడ ఉన్నారు..."

"పాతరోజుల్లో వామపక్షాలవాళ్ళు తిట్టటానికి 'బూర్జువా' అనీ, 'రియాక్షనరీ' అనీ అలా ఏవో మనకు తెలీని పదాల నుపయోగించే వాళ్ళు. నువ్వు దక్షిణపక్షంవాడివి కనుక మాకు తెలీని సంస్కృతం తిట్లు ప్రయోగిస్తున్నావా?" అన్నాడు రంగరాజు.

దత్తాత్రేయులనింక నేను మాట్లాడనివ్వ లేదు.

"సర్లే, పద. ఈ వయసులో నేను తన్నులు తింటేగానీ నువ్వు ఊరుకునేటట్లు లేవు" అని అతన్ని పైకి తీసుకెళ్ళాను.

అతనన్నది నిజమే. నాతో సహా చాలమందికి భయమే. అన్యాయాన్ని ఆపలేరు, సహించలేరు. ఎవడయినా వీరభోగవసంతరాయలు వచ్చి దుష్ట సంహారం చేసి కాపాడాలని ఆశిస్తారు సామాన్య జనం. మనుషుల ఈ భావనను సినిమావాళ్ళు పట్టుకున్నంతగా

మరెవళ్ళూ పట్టుకోలేకపోయారు. సినిమాల్లో హీరో- ఓ చిరంజీవో, ఓ బాలకృష్ణో, ఓ రవితేజో, ఓ మహేష్ బాబో - దుర్మార్గుల్ని చిత్తు చేస్తుంటే ప్రేక్షకులు తన్మయులై చూస్తారు. ప్రేక్షకుడు ఆ హీరోతో తనను తాను ఐడెంటిఫై చేసుకుంటాడు. ఆ కొద్ది క్షణాలు కనీసం తను కూడా ఆ హీరోలా పోరాడుతూ, మహా తుళ్ళింతల ననుభవిస్తాడు. కానీ, సినిమా జీవితం కాదు. ధైర్యం కండలు కలిగింది కాదు. అది మానసిక సంబంధి. ఈ ప్రపంచంలో ఎంతమందికి నైతిక బలం, ధైర్యం ఉన్నాయి.

అవును. మా కాంప్లెక్సులో అందరూ అకర్మణ్యులు, యధ్భవిష్యులే, నైతిక స్థయిర్యం లేనివారే! కాంప్లెక్సు ఇలాగే చస్తూ, బతుకుతూ కొనసాగుతుంది.

జాగృతి వార పత్రిక 28 ఫిబ్రవరి 2011 నుండి
07 మార్చి 2011 వరకు